క్లుప్తంగా

బంకుపల్లికి గానప్రవీణ బిరుదుతో సత్కారం



బంకుపల్లిని సత్కరిస్తున్న ప్రముఖ రంగస్థల కళాకారులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు బంకుపల్లి వెంకటసత్యగోపాలరావుకు నవరసనట గానప్రవీణ బిరుదును కళాపీఠం నుంచి ఆదివారం ప్రదానం చేశారు. హిరమండలంలో చీమకుర్తి కళాపీఠం నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీల్లో భాగంగా ఈ బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావు, కిలారి లక్ష్మి, జిల్లా రంగస్థల సమాఖ్య అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, బి.ఎ.మోహన్, కళాపీఠం అధ్యక్షుడు లింగమూర్తి, కళాకారులు సత్యనారాయణ, కిట్టాలపాడు శ్రీను, మీగడ మల్లికార్జునరావు, బౌరోతు శంకరరావు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన శానిటేషన్ మెటీరియల్



ఎమ్మార్సీలో భద్రపర్చిన శానిటేషన్ మెటీరియల్

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు, బాత్ రూమ్‌ల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంట్లో భాగంగా ఎప్పటికప్పుడు శానిటేషన్ మెటీరియల్ స్కూళ్లకు సరఫరా చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో గత జులై నెలలో ఒకసారి శానిటేషన్ మెటీరియల్ సరఫరా చేయగా.. రెండో విడతకు సంబంధించిన మెటీరియల్ నరసన్నపేట ఎమ్మార్సీకి ఆదివారం చేరింది. వీటిని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలోనే అందజేయనున్నట్లు ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు సురేష్

సరుబుజ్జిలి: సీనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తుగా తనిఖీలు చేయించుకోవాలని సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత (శ్రీకాకుళం) డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. మండలంలోని మూలసవలాపురం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిపి, సుగర్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు, తర్లాడ సురేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన పనులు వేగవంతం



వంతెన పనులు జరుగుతున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని కాగువాడ సమీపంలో కాగువాడ–రొమదల మధ్య ఉన్న మహేంద్రతనయ నదిపై వంతెన పనులు వేగవంతం చేస్తున్నారు. సుమారు రూ.7 కోట్లతో పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు కావడంతో పనులను యంత్రాలతో చేపడుతున్నారు. నదిలో నీరు తగ్గడంతో ఈ సమయంలోనే పనులు పూర్తిచేయాలని స్థానికులు అంటున్నారు. వంతన నిర్మాణం పూర్తయితే రొమదల, రొంపివలస, పెద్దసున్నాపురం, బైదలాపురంతోపాటు సుమారు 15 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉంటుందన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు



దర్యాప్తు చేపడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పోలాకి: మండలంలోని బెలమర గ్రామానికి చెందిన సబ్బి లక్ష్మి అనే దళిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్ సమక్షంలో ఆదివారం దర్యాప్తు నిర్వహించారు. గొర్లె సత్యం అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దాడి చేసి, ఆస్తినష్టానికి పాల్పడినట్లు సబ్బి లక్ష్మి ఫిర్యాదు చేశారు. అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయిన గడ్డికుప్పను పోలీసులు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ బాధిత మహిళకు రక్షణ కల్పిస్తామని, పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ నర్సింహమూర్తి, వీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పొందూరు: పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ రాధిక



నరసన్నపేట: జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల సెంటర్ వద్ద వేచివున్న అభ్యర్థులు



నరసన్నపేట: పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది

కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతం



నరసన్నపేట: చివరి నిమిషంలో పరుగున పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థి

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో ఆదివారం కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 10 సెంటర్లలో పరీక్షలు జరగగా దీంట్లో 2760 మందికి 2587 మంది హాజరయ్యారు. ఇద్దరు సీఐలు రాము, పైడిపునాయుడులతోపాటు 10 మంది ఎస్‌ఐలు, 70 మందికి పైగా పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల అడ్రాస్‌ను తెలియజేశారు. కొందరు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో పరీక్ష రాసేందుకు వచ్చారు.

పొందూరులో..

పొందూరు: స్థానిక సిస్టం జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో కానిస్టేబుల్ రాత పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. 400 మంది అభ్యర్థులకు 26 మంది గైర్హాజరయ్యారు. సీఐ ఆదాం, ఎస్‌ఐ లక్ష్మణరావు ఉన్నారు.



నరసన్నపేట: పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది



నరసన్నపేట: ఎల్‌వీఆర్ కళాశాల సెంటర్‌కు చంటి పిల్లతో వచ్చిన మహిళా అభ్యర్థిని



నరసన్నపేట: జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల వద్ద పరీక్షలకు వచ్చిన మహిళా అభ్యర్థులు



నరసన్నపేట: డీఆర్ఎన్ కళాశాల వద్ద అభ్యర్థులకు ఐడీలు పరిశీలిస్తున్న హిరమండలం ఎస్‌ఐ సన్యాసినాయుడు, పోలీస్ సిబ్బంది



నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

తహసీల్దార్ కార్యాలయాల్లో నిఘా నేత్రాలు





తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) సీసీ కెమెరా

కొత్తూరు: టెక్కలి డివిజన్‌లో ఉన్న తొమ్మిది తహసీల్దార్ కార్యాలయాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తూరు, పాతపట్నంతోపాటు మిగిలిన తహసీల్దార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్న ఆలోచనతోనే సబ్ కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పలు రకాల సేవలు కోసం ప్రతి నిత్యం తహసీల్దార్ కార్యాలయాలకు వస్తున్న అర్జీదారులకు అందుతున్న సేవలను సీసీ కెమెరాల ద్వార సబ్ కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తూరు: గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పారాపురం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అదే పాఠశాలలో ఆదివారం 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. ఓఎంఆర్ విధానంలో నిర్వహించిన టెస్టుకు మండలంలోని 34 పాఠశాలలు నుంచి 126 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వంద మార్కులకు నిర్వహించిన పారాపురం ఎంపీపీ పాఠశాలకు చెందిన సి.హెచ్.యశ్వంత్ 68 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 66 మార్కులతో బి.జ్యోత్స్న (మెట్టూరు), జి.దినేష్ (గులివిందలపేట), బి.సాయిసాద్విక్ (పారాపురం) ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎం రమేష్ బాబు, గ్రామ సర్పంచ్ కుంచాల రత్నాలు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పీఎంసీ చైర్మన్ కొమనాపల్లి మోహిని, వైస్ చైర్మన్ యందవ రవికుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో పేపర్లను ప్రదర్శించారు. విజేతలకు ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని నిర్వాహక ఉపాధ్యాయుడు కె.చంద్రకాంత్ తెలిపారు.

భగవద్గీతలో ప్రతి సమస్యకు పరిష్కారం



ప్రవచనాలు చెబుతున్న ఆధ్యాత్మికవేత్తలు

సారవకోట: శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలో ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఒడిశాలోని అడవ ఆశ్రమానికి చెందిన వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యంలో సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ని భగవద్గీత పారాయణంతో మానవుల దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అల్లు రామయ్య, కరుణాకర్, నరసింహస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. విశాఖపట్నానికి చెందిన లండ వెంకటరమణ అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. జాడ మోహనరావు, పిట్ల సోమేశ్వరరావు, మెండ సన్యాసిరావు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సేవా పురస్కారాల ప్రదానం



సేవా పురాస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని కస్తూర్బా గాంధీ(కేజీబీవీ) పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామరాజు సేవా పురస్కారాలు–2023 పలువురు ఉపాధ్యాయులకు ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రమాణాలు పాటించిన ఉపాధ్యాయులకు సేవా పురస్కారాలను అందించడం జరిగిందని సంస్థ అధ్యక్షుడు పి.రామరాజు తెలిపారు. సారవకోట ఎంఈఓ ఎం.వెంకటరమణ, లావేరు కేజీబీవీ ప్రిన్సిపాల్ బల్ల సుధా, మెట్టూరు హెచ్‌ఎం ఎం.మయూరి మణి, పి.ఎల్.పురం గ్రామానికి చెందిన స్కూల్ అసిస్టెంట్ అట్ల రవి, పోలవరం హైస్కూల్ అసిస్టెంట్ హెచ్.అనూరాధ, ఎల్.ఎన్.పేట స్కూల్ ఉపాధ్యాయుడు ఎం.కె.మిశ్రో, ఎస్.ఎస్.మనుగు ఉపాధ్యాయుడు సవర దేవుడుకి పురస్కారాలు అందించారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

పాతపట్నం: స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న వేంకటేశ్వర ఆలయం హుండీ కానుకలను 23వ తేదీన లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు డ్రస్ కోడ్ పాటించి లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

నేడు సరుబుజ్జిలిలో స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట పంచాయతీలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు తెలికిపెంట గ్రామంలో సచివాయం, ఆర్బీకే ప్రారంభోత్సవం, 4 గంటలకు పర్వతాలపేట, అగ్రహారం గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

పదవీకాలం పొడిగింపుపై హర్షం



భానుప్రకాష్ రెడ్డి

మెళియాపుట్టి: ఇటీవల రెడ్డిక కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భానుప్రకాష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తూ..ప్రభుత్వ పని తీరు, నవరత్నాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించడంలో మరింత కృషి చేయడానికి అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీపీడబ్ల్యూఎస్ కార్మికుల సమ్మె



ఆందోళన చేస్తున్న కార్మికులు

కొత్తూరు: మండలంలో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ కింద పనిచేస్తున్న కార్మికులు వసప గ్రామం వద్ద ఆదివారం సమ్మె ప్రారంభించారు. కార్మికులుగా నియామకం చేసిన కాంట్రాక్టర్ రెండేళ్ల నుంచి జీతాలు చెల్లించడం లేదన్నారు. జీతాలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చాలీచాలని జీతాలతోనే సేవలు అందిస్తున్నామన్నారు. అప్పులు చేసి కుటుంబాలను సాగుస్తున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని కార్మికులు శ్రీనివాసరావు, చల్లా ఆనందరావు, పలువురు కార్మికులు కోరారు. జీతాలు చెల్లించే వరకు స్కీమ్ ద్వారా తాగునీరు విడిచిపెట్టడం జరగదని కార్మికులు స్పష్టం చేశారు.

గ్రామ వలంటీర్లపై దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న రామారావు, త్రినాథులు

ఎల్.ఎన్.పేట: అన్ని వర్గాల వారికి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న గ్రామ వలంటీర్లపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని ఎల్.ఎన్.పేట మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వలంటీర్లు కేవలం ప్రభుత్వం అప్పగించిన పనులు చేస్తున్నారే తప్ప.. వారేమీ రాజకీయాలు చేయటం లేదని, అయినా చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వలంటీర్లను కించపర్చేలా మాట్లాడటం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతపక్ష నాయకులు ఉన్నచోట ఆ కమిటీ సభ్యుల సిఫార్సులు, తీర్మానాలే పరిగణలోకి తీసుకున్నారన్నారు. టీడీపీ వారికే పథకాలు, పనులు కట్టబెట్టిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. సేవాదృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థకు రాజకీయాలతో ముడిపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు, ఎర్ర జనార్దన తదితరులు పాల్గొన్నారు.

మండల కన్వీనర్లతో నవ శకం ప్రారంభం



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

మెళియాపుట్టి: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ మెరుగైన పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైపు దేశం మొత్తం చూస్తోందని, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్ అన్నారు. వీరు ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. గ్రామ వలంటీర్లతో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సచివాలయ కన్వీనర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా కన్వీనర్లు వ్యవహరిస్తారన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పినవారికే సంక్షేమ పథకాలు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే తెలుగుదేశం నాయకులు విమర్శిస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దకే పెన్షన్లతోపాటు, నవరత్నాలు అందిస్తుంటే టీడీపీ నాయకులకు కలవరమెందుకని ప్రశ్నించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, పల్లి యోగి, సర్పంచ్ గణేష్ ప్రధాన్, పి.జయమునిరావు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



శ్యామలాపురం పునరావాస కాలనీ వద్ద ఏబీ రోడ్డుపై దట్టంగా కురుస్తున్న మంచు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా పొగ మంచు దట్టంగా కురుస్తుంది. సాయంత్రానికే వాతావరణం చల్లబడి రాత్రి పూట ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తుంది. ఆదివారం ఉదయం ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు అవస్థలుపడ్డారు. వాహనదారులు కూడా రోడ్లపై తిరిగేందుకు ఇబ్బంది పడ్డారు. అపరాల పంటలు పూత, పిందే దశకు చేరుకోవటంతో మంచు కారణంగా పూత మాడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడి, మామిడి పూతకు, అపరాల పంటలకు పొగమంచుతో నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు.



సిద్ధాంతం ప్రాంతంలో పొలాలపై కురుస్తున్న మంచు